పురిజాల సుధాకర్



# ఈ కథకు ముగింపు చెప్పరూ?

"మీకు స్త్రీ అంటే ద్వేషం. మీ రచనలలో అడుగడుగునా స్త్రీని ఒక కాముకిగా చిత్రీకరిస్తారు. కనీసం, మగవానితో మాటాడితే చాలు ఆమెను పతితగా ఊహించుకునే తత్వం మీది. మీ లాంటి ఒన్‌వే రచయితలు సమాజాన్ని బాగు చేయలేరు. మీలాంటి వారివల్ల 'రచయిత' అనే పదానికే వున్న గౌరవం పోతుంది. దయచేసి ఇక నుంచి ఇటువంటి రచనలు చేయకండి. మీ ఆలోచనలన్నీ ప్రజల

మీద రుద్దకండి. మీరిలాంటి కథలు ప్రచురించడం వల్ల మీకేదో 'పేరు' వచ్చి పడుతుందని ఊహించకండి- ఏదోనాడు స్త్రీ సమూహం ప్రవంతిలా మీపై ఉరకకపోదు. మీ కలాన్ని పూర్తిగా పాతిపెట్టక పోదు...." ఆమె విసురుగా ఆ వార పత్రికను నామీద విసిరేసింది. అనవలసిన నాలుగు మాటలు అక్కసుగా అనేసింది. విసురుగా వెళ్ళిపోయింది.

ఆ పత్రిక అలా విసరబడడం వల్ల నామీంచి నేలమీద పడిపోయింది. పేజీలు తెరవబడ్డాయి. నాకథ టైటిల్ "వంచకి" పెద్ద అక్షరాలతో వెక్కిరిస్తోంది. ఆమె ఆవేశానికి నాకూ కోపం వచ్చింది.

నేను ఈ మధ్యనే కలం పట్టిన వర్ధమాన రచయితను కాను. సుమారు పదేళ్ళ నించి అడపా తడపా నా రచనలు పత్రికలలో వస్తూనే వున్నాయి.

కొన్ని కథలకి పాఠకుల ప్రశంసలు- కొన్నింటికి తిరస్కారాలు నాకు అనుభవాలే!

అయినా ఈవిడంత ధాటిగా నన్ను ఎవరూ ఎప్పుడూ ఎదుర్కోలేదు. సుడిగాలిలా వచ్చి నాపై విరుచుకు పడిన ఆమెపై కాస్త అసహ్యం వేసింది.

ఆమె ఆవేశంలో కొంత వరకు అర్థం వుందేమో!

నా మనసు నన్నే సూటిగా ప్రశ్నించింది.

ముఖ్యంగా నా కథలన్నీ స్త్రీ చుట్టూ తిరుగుతాయి. స్త్రీ ఎటువంటి మనస్తత్వం కలదో పూర్తిగా ఎవరో స్త్రీని పరిశీలిస్తే గాని....కలం పట్టని తత్వం నాది. ఒక స్త్రీ ప్రవర్తన, గుణగణాలు, ఆమె ప్రవర్తనకు పూర్వాపరాలు, కారణాలు అన్నీ కూలంకషంగా పరిశీలించాక నా హృదయం మధనపడి--మదనపడి తప్పు కాని ఒప్పు కాని పూర్తిగా నిర్ణయించుకొని కాని నేను 'కథ' రాయను. ఆ కథలో ఆ స్త్రీ ప్రవర్తన పూర్తిగా బట్టబయలు చేస్తాను. ఆ స్త్రీ ఎలా ప్రవర్తిస్తే బాగుండేదో సకారణాలతో సహా వివరిస్తాను. ఆ పాత్ర ద్వారా ఇటువంటి స్త్రీలకు కనువిప్పు కలిగించడం నా అలవాటు. నా రచనల వల్ల బాగుపడిన స్త్రీలూ వున్నారు, తమ తప్పులు తెలుసుకొని పశ్చాత్తాప పడిన స్త్రీలూ వున్నారు, తమ ప్రవర్తనను మార్చుకొనే స్త్రీలూ వున్నారు.

ఒకోసారి నా కథలలో ముగింపులా తమ బ్రతుకుని తీర్చిదిద్దుకొనే స్త్రీలు వున్నారు.

కానీ ఇన్నాళ్ళకు ఈమె.. నా కథ చదివి సూటిగా నాపై ధ్వజం ఎత్తింది. నన్ను రచయితగా పనికిరానివాడుగా జమ కట్టింది.

ఈ అనుభవాన్ని నా జీవితంలో మరచిపోలేను.

కిటికీ లోంచి ఎంతసేపట్నించి చూస్తోందోకానీ....పక్కింటి పాప- ఆమె చూపుల్లో జాలి, సానుభూతి వ్యక్తం అవుతోంది. కుర్చీలోంచి లేచాను. ఆ తెరచివున్న వీక్లీని టేబిల్‌పై పెట్టాను. టేబిల్ మీదున్న సిగరెట్ పెట్టెలోంచి ఓ సిగరెట్ తీసి, అగ్గిపుల్ల గీసి అంటించాను. నా హృదయం భారంగా వుంది. సిగరెట్ పొగ రింగులు రింగులుగా నా గదిలో. మరలా కుర్చీలో చేరబడ్డాను. పాప నావేపు విచిత్రంగా చూసి పారిపోయింది తుర్రు మని.

నా హృదయం గతంలోకి జారుకుంది.

నేను పదవ తరగతి చదువుతున్న రోజులు. పదిహేను,పదహారేళ్ళ పరువం. అప్పుడప్పుడే వస్తున్న నూనూగు మీసాలు. అందమైన కన్నెలందరూ నన్ను అదోలా చూడ్డం మొదలెట్టారు. ఆ చూపులకు అర్థం ఏమిటో అప్పట్లో నాకు తెలియదు. నేను స్కూల్ నుంచి వస్తుంటే చాలు వీధిలో ఎన్నో కళ్ళు నా మీద పడేవి.

అమ్మ నాకు అప్పట్లో దిష్టి కూడా తీసేది.

నా పబ్లిక్ పరీక్షలు దగ్గరవుతున్న కొద్దీ నాకు భయం పట్టుకుంది. అమ్మ నన్ను ముద్దుగా వుండటం చూసి మందలించేది. ఇంకా పరీక్షలు రెండు నెలలే వున్నాయి. నా ప్రోగ్రెస్ కార్డ్ చూసిన నాన్నగారు పరీక్ష పాసవనేమోనని చాలా భయపడ్డారు. అందుకే నన్ను మా క్లాస్ మాష్టారి వద్ద ప్రయివేట్‌కు కుదిర్చారు.

నాకు ప్రైవేటంటే గిట్టదు. ఇంటి దగ్గర మాష్టర్లు అన్ని పనులూ చేయించుకుంటారనే వూహ నా చిన్నప్పుడే నాలో స్థిరపడిపోయింది. అందుకే నేను ప్రైవేటుకు వెళ్ళనని మొరాయించేవాడ్ని! కాని నాన్న దెబ్బలాడారు. పరీక్ష ఫస్ట్‌క్లాస్‌లో పాసయితే బట్టలు కుట్టిస్తామన్నారు. ఉంగరం కూడా చేయిస్తామన్నారు. నాకు తెలుసు. నాకు ఫస్ట్‌క్లాస్ రాదని. నేను ఆర్డినరీ స్టూడెంట్‌ని. కానీ....తల్లి దండ్రుల ఆశ అలాంటిది. అంచేత నేను మరి ప్రైవేటుకు వెళ్ళక తప్పేది కాదు.

ఆ ప్రైవేట్లో పద్మప్రియ అనే అమ్మాయి నాతో అతి చనువుగా

వుండేది. అప్పుడప్పుడు కాంపాస్ బాక్సులో డబ్బులు పెట్టి తెచ్చి యిచ్చేది. బిస్కట్స్, చాక్లెట్స్ కయితే లెక్కే లేదు. విపరీతంగా కొనిపెట్టేది. నన్ను ఆ అమ్మాయి ఎందుకలా అభిమానిస్తోందో అర్థం కాని రోజులవి.

పరీక్షల కోసం పట్టుబట్టి చదవడం ప్రారంభం అయింది.

ఇంకా 'వారం' రోజులే వున్నాయి పరీక్షలు.

హాల్ టికెట్స్ తీసుకోవడానికై వెళ్లాను.

నా వెంట ఆమెకూడా వచ్చింది ఆ రోజు.

ఇద్దరం హాల్ టికెట్స్ తీసుకున్నాం ఆ తర్వాత, ఇంటికి వచ్చేస్తున్నప్పుడు ఆమె నన్ను ఆ మాట ఈ మాట చెప్పి తోటలోకి తీసుకెళ్ళింది. ఎవరూ లేరని పూర్తిగా అనుకున్నాక, ఆమె నా చేతిలో వున్న హాల్ టికెట్ తీసుకొని, ఆమె పుస్తకంలో పెట్టి, ఆ పుస్తకాన్ని చెట్టు మొదలు వద్ద వుంచేసింది. ఆ మామిడిచెట్టు చాటుకి తీసుకెళ్ళి నన్ను గట్టిగా కౌగిలించుకుంది నా బుగ్గల్ని ముద్దుల్తో నింపేసింది.

నాకు వూపిరాడలేదు.

వుక్కిరి బిక్కిరి అయిపోయాను. నాకు ఎందుకో ఆమె చర్య అసహ్యం కలిగించింది.

ఆమెని విసురుగా విడిపించుకొని, నా హాల్ టికెట్ పట్టుకొని....గబగబా పరుగెట్టి ఇంటికి చేరుకున్నాను.

ఆ అవతారంతో యింటికి చేరిన నన్ను అమ్మ చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమిరా... ఎవరయినా కొట్టారా?" అని అడిగింది.

నేను ఏడుస్తూ జరిగిందంతా చెప్పాను.

అమ్మ ఆశ్చర్యపోయింది.

ఆ తర్వాత చిన్నగా నవ్వేసి నా అమాయకత్వానికి జాలిపడి నన్ను స్నానం చేయమంది. చేసాను. భోంచేసాను.

ఆ తర్వాత ఆ అమ్మాయి నా వైపు కోపంగా చూసేది ఎక్కడ కనబడినా నేను ఆమెతో మాటాడ్డం మానేసాను. ఆ పరీక్షలు అయిన తర్వాత వేసవిలో పద్మప్రియ పెళ్ళి కూడా అయింది ఎంతో వైభవంగా,

ఆ పెళ్ళికి నేనూ వెళ్ళాను.

ఆమె పెళ్ళి కూతురు వేషంలో యెంత అందంగా వుంది? అదేదో సినిమాలో పెళ్ళికూతురు అచ్చం యిలాగే వుంది అనిపించింది.

ఆమె పదే పదే పెళ్ళి పీటలమీంచి

నన్నే చూసేది దిగులుగా. నాకూ జాలి వేసింది ఆమె మీద.

వెంటనే ఇంటికొచ్చి మంచం మీద బోర్లాపడుకొని వెక్కి వెక్కి ఏడ్చాను. అలా నిద్రపోయాను.

ఆమె అత్తవారింటికి వెళ్ళిపోయింది.

నన్ను మర్చిపోయింది.

ఆ విధంగా, నా జీవితంలో మొట్ట మొదటి సారిగా ఓ స్త్రీ ప్రవేశించింది. ఆమె అత్తవారింటికి వెళ్ళాక నాకు పూర్తిగా దిగులు పట్టుకుంది. నేను సరిగా అన్నం తినేవాడ్ని కాదు. అమ్మ నన్ను మందలించేది.

నేను థర్డ్‌క్లాస్‌లో సెకెండ్‌క్లాస్ పాస యాను. మా స్కూల్‌లో మొత్తం ఏడుగురే పాసయ్యారు. అందులో నేనొకణ్ణి. అందుకే నాన్న మరి నన్నేమీ అన్లేదు. ఫస్ట్‌క్లాస్ రాక పోయినా నాకు కొత్త బట్టలు కుట్టించారు. ఉంగరం చేయించారు.

o o o

నాకోసం కేరేజ్ తెచ్చాడు బాయ్.

ఆకలి బాగానే వేస్తోంది.

ఆతృతగా భోజనం చేసాను.

కేరేజ్ నీట్‌గా కడిగేసి వుంచేసి వెళ్ళిపోయాడు బాయ్.

సమయం పన్నెండయింది.

నా ఆలోచనలు మళ్ళీ ముసురు కున్నాయి.

నేను ఇంటర్ మీడియట్‌లో మా ప్రక్క వూర్లో వున్న జూనియర్ కాలేజీలో చేరాను. రోజూ సైకిల్ మీద వెళ్ళి రావడం అలవాటయింది. ఆ కాలేజీలో చదువుతున్నపుడు పరిచయం అయింది స్వప్న!

స్వప్న నా జీవితంలో మరుపురాని స్వప్నంలా మిగిలి పోయింది.

నాది ఇంటర్‌లో బై. పి సి. గ్రూఫ్.

చాలా కష్టపడి చదవాల్సిన సబ్జెక్ట్సు. ప్రాక్టికల్స్.

బోటనీ, జువాలజీ. ఫిజిక్స్, కెమిష్ట్రి ప్రాక్టికల్స్‌లో నేను వెనక బడి యుండేవాడ్ని. లెక్చరర్స్ నన్ను సరిగా ఆదరించేవారు కారు, కార ణం నేను చక చక ప్రాక్టికల్స్ చేయలేనని! ఆ పరిస్థితులలో స్వప్న చాలా హెల్ప్ చేసేది. తన ప్రయోగం తొందరగా పూర్తిచేసి, నాకు సహాయం చేసేది. అలా కొన్నాళ్ళు ఎంతో స్నేహంగా మస లిన ఆమె నన్ను పూర్తిగా ఆకట్టు కుంది. నేనూ అందరితోపాటు ఎంతో నైపుణ్యంగా ప్రయోగాలు చేసేవాడ్ని. అలా అందరిలో నవ్వుల పాలు కాకుండా కాపా డింది ఆమె ఆమెకు నేనూ కృతజ్ఞ

తలు చెప్పుకొనే వాడ్ని! తేలిగ్గా నవ్వేసేది.

కాలేజీల్లో ఓ జాడ్యం వుంది.

ఒక ఆడ ఒక మగ కాస్త చనువుగా వుంటే చాలు.... వెంటనే రకరకాల పుకార్లు పుడతాయి.

మా ఇద్దరి పేర్లు గోడలకెక్కాయి. కాలేజీ మెయిన్ రోడ్ మీద కూడ సుద్దముక్కలతో ఎవరో మా పేర్లు రకరకాలుగా రాసేసారు. ఆవిధంగా అన్నెం పున్నెం యెరుగని ఆమె బ్రతుకు గోడల పాలవడంతో నేను చాలా ఫీలయ్యాను.

ఆమె ఫాదర్ నన్ను పిలిపించి నానా చీవాట్లు పెట్టాడు.

నా వల్ల 'తప్పు' లేదని ఎంత మొర పెట్టుకున్నా విన్లేదు.

పరీక్షలు కూడ దగ్గర పడడంతో ఆమె ..కాలేజీ నా మూలంగా మానేయడం చాలా బాధనిపించింది, నేను ప్రిన్సిపాల్ దగ్గరికెళ్ళి ఆమె గురించి ఎంతగానో రిక్వెస్టు చేసాను. అతను ఆమె నాన్నగార్ని పిలిపించి పరీక్షల్లో కూర్చోబెట్టం డని చెప్పారు.

ఆమెని ఏ విద్యార్థీ యేమీ అన కుండా చూసేబాధ్యత తనదని హామీ ఇచ్చారు.

ప్రాక్టికల్స్, పరీక్షలు, అయిపో యాయి హాయిగా!

ఆఖరి పరీక్షనాడు సైకిల్ మీద వెళ్ళిపోబోతుండగా ఆమె తన ఇంటికి రమ్మనమంది.

"మీ నాన్నగారు నా ప్రాణం తీస్తారు...." అన్నాను.

"మా నాన్నగారు కేంప్‌కెళ్ళారు. ఇంట్లో ఇంకెవరున్నారని నిన్ను చంపేయడానికి....?" చిన్నగా నవ్వుతూ అందామె.

ఆమెకు ఫాదర్ తప్ప ఇంకెవరూ లేరు.

అయినా నాకోసం పేరెంట్స్ ఎదురు చూస్తుంటారని అన్నాను. ఆమె ఒప్పుకోలేదు. పట్టుబట్టి మరీ తీసుకెళ్ళింది,

రెండేళ్ళ స్నేహంతో అలా వెళ్ళ డం తప్పనిపించలేదు.

ఆమె మేడ మీద గదికి నన్ను తీసుకుపోయింది.

భోజనం పెట్టింది తిన్నాను.

ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం.

సిలోన్‌లో తెలుగు కార్యక్రమం కూడ పూర్తయింది.

సమయం నాలుగున్నర దాటుతోంది.

ఆమె తలుపులు వేసింది.

వెంటనే గట్టిగా కౌగిలించుకుంది.

ఆ బలహీన మయిన క్షణాలు నా మనస్తత్వానికి అగ్ని పరీక్ష అయ్యాయి.

ఆమెకా భావం వున్నట్టు ఎప్పుడూ బయట పడలేదు.

అవకాశం కుదరిందని, ఆమె తెగించిందని 'అర్ధం' అయింది అంతవరకూ ఆమె మీదున్న సద్భావం మంచులా కరిగిపోయింది.

నాలో నాకే ఆమెపై అసహ్యం వేసింది.

"ఆడదానికి అవకాశం ముఖ్యం..." అనే బలమయిన నిర్ణయం నా మనసులో చోటు చేసుకుంది.

ఛెళ్ళుమని లెంపకాయ కొట్టాను.

అక్కడింకో క్షణం వుండకుండా సైకిల్‌తో మా ఊరు వచ్చేసాను.

o o o

డిగ్రీతో నా చదువు ఆగిపోయింది. డిగ్రీలో కూడ ఇలాంటి అనుభవాలు కొన్ని తారసబడ్డాయి.

ఎవరో అమ్మాయి నాతో చనువుగా.... స్నేహంగా ప్రవర్తించడం ఆ పిదప స్నేహానికి సరయిన ముగింపు చెప్పక పోవడం. అలా ప్రవర్తించడంతో ఆ అమ్మాయితో నాకున్న స్నేహబంధం తెగిపోవడం.... నన్ను అర్ధం చేసుకోక పోవడం.... నేను అసహ్యించుకోవడం....ఆఖరికి నా కళ్ళముందే మరో అబ్బాయితో తిరిగి నన్ను 'సవాల్' చేయడం....పిదప మోస పోవడం ఆ అమ్మాయి తల్లి దండ్రులు ఏదోలా పెళ్ళి ఎవరో అబ్బాయితో చేసేయడం.... ఇవన్నీ నేను స్వయంగా అనుభవించాను. ఇవన్నీ నా జీవితంలో ఎదురయిన చేదు నిజాలు. నా కళ్ళతో కనిపెట్టిన పచ్చి నిజాలు.

అప్పట్నించి నాకు పెళ్ళంటే భయం—

నా డిగ్రీ పూర్తయి ఉద్యోగం రాకముందునుంచే నాకు చాలా సంబంధాలు వచ్చేవి. కాని.... పెళ్ళి చూపులకు వెళ్లాలంటేనే భయం. పెళ్ళి చూపులకెళ్ళినా ఆ పెళ్ళి కూతుర్ని వివరాలు ఏం తెలుస్తాయి ఆ కొద్ది నిమిషాల్లో?....ఇద్దరు ముగ్గుర్ని చూసాక మరి పెళ్ళి చూపులను విరమించుకున్నాను.

కానీ....ఒక మంచి సంబంధం నాకు మళ్ళీ వచ్చింది.

అమ్మాయి అంత అందంగా లేకపోయినా నా బంధువర్గం వత్తిడితో, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే మంచిదనే నిర్ణయానికొచ్చాను. కాని నా ఆశలు ఆశయాలకు ఆ అమ్మాయి ఆశలు ఆశయాలు కో ఇన్‌సైడ్ అవుతాయో....లేదో.... అన్న సంశయం ఏర్పడింది.

అందుకే నాకున్న ఆశయాలను ఆలోచనలను మిళితం చేస్తూ కొన్ని ప్రశ్నలుగా తయారు చేసాను. ఆ

అమ్మాయికి పంపాను. కానీ....ఆ అమ్మాయి నుంచి ఎన్నాళ్ళకీ జవాబులు రాలేదు.

అంటే ఆ అమ్మాయి నా ఊహలకి తగినది కాదని నిరూపణ అయినట్లే కదా! ఆ విధంగా ఆ సంబంధం తప్పిపోయింది.

ఆ తర్వాత నాకు నచ్చిన అమ్మాయిని నేనే వెదుక్కుంటానని ఇంట్లో ఖచ్చితంగా చెప్పేసాను.

నాకో ఆఫీసులో "ఉద్యోగం" వచ్చింది.

అప్పట్నించి నేను నా ఆశయాలకు తగిన అమ్మాయి కోసం అన్వేషణ చేస్తున్నాను. ఫలించడం లేదు.

తల్లీ తండ్రీ ఇప్పటికే నా గురించి ఆందోళన పడుతున్నారు. నా ఉద్యోగం వచ్చినాక ఎమ్. ఓ. లు పంపినా నా మీద వున్న కోపంతో 'రిటన్' చేసే వారు.

నాకు ఒంటరి తనం అలవాటయిపోయింది. ఒంటరితనానికి నిష్కృతిగా రచనలు చేయడం అలవాటు చేసుకున్నాను. ఆఫీస్‌లో స్టాఫ్ అంతా నన్ను చూసి జాలిపడతారు. జీవితాన్ని అనుభవించాల్సిన వయసులో అంతా దుఃఖమయం చేసుకున్నానని వాళ్ళకి నామీద జాలి! నా జీవితంలో ఎదురయిన సుడిగుండాలు నన్ను రచయితగా చేసాయి. నా రచనలతో గొప్ప పేరు సంపాదించాలనే ఆశ నాకు అసలు లేదు. ఆ పారితోషికాల డబ్బు నా సిగరెట్ పెట్టెలకే పరిమితం! కొన్ని కొత్త పత్రికలు! సరు క్యులేషన్ లేని పత్రికలు నాకసలు పారితోషికాలు పంపనే పంపవు. అయినా ఆఫీస్ అయిపోగా మిగిలిన సమయాన్ని ఇలా వ్యయం చేయడం నా హాబీ!

అందుకే నేను సమాజాన్ని జాగ్రత్తగా పరిశీలించడం ఆరంభించాను. అందులో స్త్రీలను మరీ ఆసక్తిగా పరిశీలించడానికి ప్రధాన కారణం నాకు పసితనం నుంచే ఎదురయిన అనుభవాలు. లేత హృదయంపై గాఢంగా పడిన ముద్రలు....అడుగడుగునా స్త్రీల ప్రవర్తనని గమనించడం అలవాటయ్యింది.

ఒక్కొక్క స్త్రీ నుంచి ఒక్కో కథ లభించేది!

ఆ కథలన్నీ ప్రస్తుతానికి చాలా సంఖ్యలో అచ్చయ్యాయి.

నా రచనలు "ఒన్‌వే" అంటారు కొందరు.

స్త్రీల మీద వున్న అక్కసును తీర్చుకుంటున్నావు, అంటారు కొందరు.

పరిచయం వున్న తోటి రచయి తలు వెరైటీ లేదు అంటారు.
ఇంచు మించు కథలన్నిటిలో ఒకే "థీమ్" అంటారు కొందరు.
ఎవరేమనుకున్నా నాకు లక్ష్యం లేదు.
నా లక్ష్యం ఒక్కటే.
నా కథల ద్వారా స్త్రీలలో పతివ్రత్న రావాలి!
స్త్రీల ప్రవర్తనలో పరివర్తన రావాలి!
స్త్రీ తన "శీలం" విలువను తనకు తాను గమనించుకోవాలి!
తన భర్త, పిల్లలతో కళకళ లాడుతూ వుండాలి!
పది కాలాలపాటు పచ్చగా ఉండాలి!
ఈ జరుగుతున్న కథకు ముగింపు చెప్పాల్సింది నేను కాదు.
అవును నేను కాదు!
స్త్రీ....సీత లాంటి స్త్రీ!

* * *

మళ్ళీ తలుపు చప్పుడయింది.
ఆలోచనలు తెగిపోయాయి.
తలుపు తీసాను.
ఎవరో అమ్మాయి.
మెరుపు తీగలా వుంది.
ఆమె చేతిలో నా కథ వున్న వీక్లీ!
ఆమె పెదవులపై చిరుదరహాసం లాస్యం చేస్తోంది.

"రండీ....కూర్చోండి...." ఆహ్వానించాను ఆ అపరిచితురాల్ని.
"వంచకి" కథ చాలా బాగుంది.... నాలాంటి వారికి మీ కథ కను విప్పు...."
"థాంక్స్...."
ఫ్లాస్క్‌లో కాఫీ ఆమెకు ఆఫర్ చేసాను.

మొహమాట పడుతూ తీసుకుంది.
"మీరు కథలు బాగా రాస్తారు...."
"........"
"సహజత్వానికి దగ్గరగా వుంటాయి...."
"........"
"యూ ఆర్ మోస్ట్ జీనియస్ అండ్ ఎక్స్‌పర్ట్...."
"నన్ను మొహమాట పెట్టేస్తున్నారు....కానీ....ఈ కథనే ఉదయం ఒక వివాహిత విసిరికొట్టారు...." స్పష్టంగా చెప్పాను.
ఆమె చక్రాల లాంటి కళ్ళలో అంతులేని ఆశ్చర్యం.

○ ○ ○

ఈ జరుగుతున్న కథకు ముగింపు చెప్పాల్సింది నేను కాదు.
అవును నేను కాదు.
స్త్రీ....సీతలాంటి స్త్రీ! *